ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్
జిల్లా వార్తలు

5

మంగళవారం 7 మే 2024



ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేడు

- కరీంనగర్‌లో ఆ పార్టీది మూడో స్థానం
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట, మే 6: కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేరని, అలాంటి పార్టీకి ఓటు ఎలా వేస్తారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం జమ్మికుంటలో నిర్వహించిన బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తాము పువ్వు గుర్తుకు ఓటు వేయాలని తిరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గాడిద గుడ్డు గుర్తు పట్టుకుని తిరుగుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలనుకునే వాళ్ల బ్యాలెట్‌లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటు వేయాలన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన కాంగ్రెస్ గ్రాఫ్ పెరగడం లేదన్నారు. కరీంనగర్‌లో ఆ పార్టీ మూడో స్థానంలో ఉందన్నారు. హామీలు అమలు చేయనందుకు జనం తిడుతుంటే రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డు పేరుతో చర్చను పక్కా దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సమ్మేళనానికి హాజరైన బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గురించి మాట్లాడుతూ దేశానికి దిశ, దశ చూపించగలిగే గొప్ప నాయకుడు నరేంద్రమోదీ అని భావించి ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారన్నారు. తమిళనాడులో బీజేపీ శక్తివంతమవడంలో అన్నామలై కీలకపాత్ర పోషించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

మోదీ గుండెలో బండి సంజయ్‌కి ప్రత్యేక స్థానం

- బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుండెలో బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక స్థానం ఉందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. సౌత్ ఇండియాలో బీజేపీని బలోపేతం చేయడానికే ఆయనకు జాతీయ స్థాయి పదవి ఇచ్చారని తెలిపారు. బండి సంజయ్ స్ఫూర్తితోనే తాను తమిళనాడులో పాదయాత్ర చేశానని, ఆయన గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనన్నారు. బండి చేసిన పోరాటాలు దేశానికి ఆదర్శమని, లాఠీలు, కేసులు, జైళ్లను లెక్క చేయకుండా ముందుకు వెళ్లారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధిని యూజ్ లెస్ స్కీంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసిపారేశారని, రైతులకు మాత్రం సహాయం చేయలేకపోయారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు పాల్గొన్నారు.



అన్నామలై, బండి సంజయ్‌కుమార్‌లను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ఈవీఎంల కమిషనింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్‌ను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించి, పాలిటెక్నిక్ కళాశాలలో మానకొండూర్ నియోజక వర్గానికి చెందిన ఈవీఎంల కమిషనింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీవీ ప్యాట్స్‌లో జాగ్రత్తగా సింబల్ లోడింగ్ చేయాలని సూచించారు. ఈవీఎంల కమిషనింగ్ పూర్తయిన తర్వాత ఒకటికి రెండు సార్లు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈవీఎంలు సరిగా పని చేస్తున్నాయో లేదో చూసుకోవా లని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కరీంనగర్ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ యూనిట్స్ 990, కంట్రోల్ యూనిట్స్ 493, వీవీ ప్యాట్స్ 553 కేటాయించామన్నారు. చొప్పదండిలో 327 పోలీస్ స్టేషన్లకు 820 బ్యాలెట్ యూనిట్స్ 408 కంట్రోల్ యూనిట్స్ 457 వీవీ ప్యాట్స్ కేటాయించామని తెలిపారు. మానకొండూర్‌లో 316 పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ యూనిట్లు 794 కంట్రోల్ యూనిట్లు 395, వీవీ ప్యాట్స్ 442 కేటాయించామన్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను సిబ్బంది చేపట్టారని తెలిపారు. కమిషనింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారని చెప్పారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు వీటన్నింటినీ పోలింగ్ కేంద్రాలకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు కనకయ్య, రమేశ్, రాజేశ్, నరేందర్, రాజకుమార్ పాల్గొన్నారు.

దేశ ప్రజలను వంచించిన బీజేపీని గద్దెదించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సమావేశం

భగత్‌నగర్, మే 6: దేశ ప్రజలను వంచించిన బీజేపీని గద్దె దించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దళితులు, మైనార్టీలు, మేధావులపై దాడులు పెరిగాయన్నారు. నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో సామాన్యులపై భారం పడిందన్నారు. సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశ ప్రగతి తిరోగమనంలో పయనించిందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే కుల గణన జరిగి తీరుతుందన్నారు. .



సీపీఐ నాయకులతో అభివాదం చేస్తున్న వెలిచాల రాజేందర్ రావు

దేశభద్రత, మత సామరస్యం కోసం ఇండియా కూటమి రావాలి

- కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

దేశభద్రత, సమగ్రత, మతసామరస్యం కోసం కేంద్రంలో ఇండియా కూటమి రావాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మత విద్వేషాలు, మారణహోమాలు నిత్యకృత్యంగా మారుతాయన్నారు. రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోందన్నారు. బీజేపీ ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలువాలని కోరుకుంటుందన్నారు. దీని వెనక రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర ఉందన్నారు. కరీంనగర్ పరిధిలో ఎంపీల్యాడ్స్ కింద 25 కోట్లు మంజూరుకాగా 5 కోట్లు మాత్రమే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. సీపీఐ తమకు మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. సమావేశంలో సీపీఐ పార్లమెంట్ నియోజక వర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, సిద్దిపేట, హనుమకొండ, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, కర్రె భిక్షపతి, గుంటి వేణు, వెన్న సురేష్, తాండ్ర సదానందం, కేదారి, గడిపె మల్లేష్, ఆదరి శ్రీనివాస్, కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో వెలిచాల రాజేందర్‌రావు

కాంగ్రెస్‌లో చేరికలు

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, నర్సింగోజు గోపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ దావు సంపత్, వార్డు సభ్యులు బి హన్మంతరావు, కోట కరుణాకర్, ఎండీ హమీద్‌తో పాటు 25మంది ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి చేరగా పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు కుట్ర

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

వేములవాడ, మే 6 : హైదరాబాద్ నగరాన్ని ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని కరీంనగర్ లోక్ సభ టీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. సోమవారం వేములవాడలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌ను మరో 10 ఏళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు బీజేపీ, తెలుగుదేశం, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని బీజేపీ యోచిస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి 500 కోట్లు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి కావాలా.. విధ్వంసం కావాలో ప్రజలే తేల్చుకోవాలని, అభివృద్ధి ఆకాంక్షగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన కోరారు.



వేములవాడలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కాంగ్రెస్‌కు ఓటు వేసి బాధ పడుతున్న జనం

- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కేటీఆర్

సిరిసిల్ల: కాంగ్రెస్‌కు ఓటు వేసి చాలామంది బాధ పడుతున్నారని, పాలిచ్చే బర్రెను విడిచి పెట్టి పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారకరామారావు అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి తినే పల్లెంలో మన్ను పోసుకున్నామని చాలా మంది బాధపడుతున్నారన్నారు. తనకు జన్మనిచ్చింది అమ్మ అయితే.. రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్ల అన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కండువా లేకుండా గాంధీ చౌరస్తాలో నిలబడితే ఎవరూ గుర్తు పట్టారని, బస్ కోసం నిలబడ్డాడని అనుకుంటారని ఎద్దేవా చేశారు. డమ్మీని తీసుకొచ్చి నిలబెట్టారన్నారు. తమకు బీజేపీతోనే పోటీ అన్నారు. బీజేపీకి పనిచేయడం చేతకాదని, అందుకే ఇంటింటికి అక్షింతలు పంచారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే అరు నెలల్లోనే కేసీఆర్ రాష్ట రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుందన్నారు. బీజేపీ గెలిస్తే 2014లో నల్లధనం తెచ్చి 15 లక్షలు ఖాతాల్లో వేస్తానన్న మోదీ వేయలేదన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఒక్క మంచి పనైనా చేశాడా అన్నారు.



సిరిసిల్లలో రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

విద్యుత్ సిబ్బందికి శిక్షణ



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ ఈ గంగాధర్

గణేశ్‌నగర్, మే 6: కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ హుజూరాబాద్ డివిజన్ అధికారులు, సిబ్బంది విద్యుత్ భద్రత వారోత్సవాలు, జాగ్రత్తపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భగా ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. పని చేస్తున్నప్పుడు ఎర్త్ రాడ్, హెల్మెట్, గ్లౌజెస్, టెస్టర్ ఇతర పరికరాలు వాడాలన్నారు. వేసవిలో డిమాండ్ పెరిగినందున నిరంతరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు విజయేందర్‌రెడ్డి, ఎస్ లక్ష్మారెడ్డి, రాజేశం, ఏఈఈలు వి శ్రీనివాస్, సీహెచ్ రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కమిషనరేట్ వ్యాప్తంగా వాహనాల తనిఖీ



నగరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మే 6: లోకసభ ఎన్నికల దృష్ట్యా అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రవాణాను అడ్డుకునేందకు చర్యలు తీసుకుంటున్నామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. సోమవారం కమిషరేట్ వ్యాప్తంగా కరీంనగర్ బస్టాండ్ ఏరియా, కమాన్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, బైపాస్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీపీ తెలిపారు.

జనజాతర సభాస్థలి పరిశీలన



జనజాతర సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు

కరీంనగర్ అర్బన్, మే 6: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించనున్న జన జాతర బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కానున్నారు. సభ ఏర్పాట్లను సోమవారం డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. దాదాపు 50 వేల మంది ఈ సభకు హాజరు కానున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులు, బాధ్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా చైర్మన్ పులి అంజనేయులగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల చుట్టూ నేతల ప్రదక్షిణలు




మల్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, తాటిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల, మే 6: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పార్టీల నేతలు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు దంచి కొడుతుండడంతో ఉదయం పూటే ఉపాధి హామీ పనులకు వెలుతున్న మహిళల వద్దకే నాయకులు పరుగెడుతున్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పోటీలు పడి ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపట్టారు. ఎండ వేడి నివారణకు మజ్జిగ పాకెట్లు అందిస్తూ పనిలో పనిగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రోజుకో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ప్రచారం పూర్తి చేయగా సాయంకాలం వేళలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

● సభలకు వెళితే రూ. 200

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తమ సభలకు వచ్చే మహిళలకు 200 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఉదయం ఉపాధి పనులకు వెలుతున్న మహిళలు సాయంత్రం ఎన్నికల సభలు, సమావేశాలకు వెళుతున్నారు. దీంతో వారికి కొంత ఉపాధి లభిస్తోంది.

మాజీ సీఎం కేసీఆర్ బస్సు తనిఖీ



కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్, మే 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల నుంచి నిజామాబాద్ రోడ్ షోకి వెళ్తున్న క్రమంలో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు తనిఖీ చేశారు. పోలీసు అధికారులకు కేసీఆర్ సహకరించారు.

గడి స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

● కలెక్టరేట్‌కు తరలి వచ్చిన చల్‌గల్ గ్రామస్థులు



వినతిపత్రాన్ని చూపుతున్న చల్‌గల్ గ్రామస్థులు

జగిత్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్‌గల్ గడి స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ గామస్థులు జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. గడి ముందు గల ఖాళీ స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం ప్రారంభించాడన్నారు. గ్రామానికి చెందిన ఉమ్మడి ఆస్తి అయిన గడి ముందు గల స్థలాన్ని ఆక్రమించడం సరైంది కాదని తెలిపారు. గడి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలోని అన్ని రకాల నిర్మాణాలు, కట్టడాలు తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతిప్రతం సమర్పించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల మే 6: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం వైద్యులు, సిబ్బంది కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆసుపత్రి అవరణలో నిరసన తెలిపారు. వైద్యులు సిబ్బంది చేస్తున్న నిరసనకు మద్దతుగా తెలంగాణ గవర్నమెంట్ గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్, ఐఎం అసోసియేషన్ సభ్యులు మద్దతు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం డాక్టర్, సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డ్యూటీలో ఉన్న వైద్యులు సిబ్బందిపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపీ సేవలను రద్దు చేసి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీసీహెచ్‌ఎస్ జిల్లా అధికారిణి సురక్షతన సందర్శించారు. జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయం ఉన్నత అధికారులకు నివేదించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రామయ్యపల్లెలో చోరీ

ధర్మపురి,మే6: మండలంలోని రామయ్యపల్లె గ్రామంలో ఊరడి జయకర్ అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. రెండు రోజుల క్రితం జయకర్ రాత్రి వేళలో తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులు తెరచి 10 వేలు నగదు, 45 తులాల వెండి ఆభరణాలు, ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, మే6: మండలంలోని బొమ్మకల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 102 మంది వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి సభ్యులు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎం ఎల్ఎన్‌రెడ్డి, ఊట్కూరు రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే 6: మండల కేంద్రానికి చెందిన దండుగుల శేఖర్‌కు చెందిన గుడిసె సోమవారం ఉదయం దగ్ధమైంది. గుడిసెలోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కొడిమ్యాలలో దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయలు అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రాజాపూర్‌లో పొలం దగ్ధం

రామగిరి, మే 6: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఎలువాక సంపత్‌కుమార్‌కు చెందిన అర ఎకరం పొలం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బురదగా ఉండడంతో కోపించిన వరిని కల్లంలో కుప్పగా పేర్చి ఉంచారు. సోమవారం అగ్ని ప్రమాదంలో వరికుప్ప దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమా రు 20 బస్తాల వడ్లు అగ్ని ఆహుతి అయ్యాయని రైతు తెలిపాడు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 6: కరీంనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 5.32 లక్షల రూపాయలు పట్టుకున్నట్లు కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళుతున్న డబ్బులను వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుభాష్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తీగలగుట్టపల్లికి చెందిన ఒడ్నాల రవీందర్ వద్ద 3.32 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వావిలాలపల్లి ట్రినిటీ గర్ల్స్ జూనియర్ కళాశాల వద్ద వాహనాల తనిఖీల్లో గౌతమి నగర్‌కు చెందిన పింగిళి విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద నుంచి రెండు లక్షల రూపాయ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారివద్ద తగి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 1.2 లక్షల నగదు పట్టుకు న్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా 1.2 లక్షల నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ నగదును సీజ్ చేశామన్నారు.

● జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పలువురి వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న ఐదు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల ప్రాంతానికి తరలిస్తున్న టీవీలు, ఫ్రిజ్‌లను సీజ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో సీఐ వేణు గోపాల్. ఎస్సైలు నరేష్, మన్మధరావు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉనికికే ప్రమాదం తెస్తున్న బీజేపీ

● రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలు పన్నుతున్న బీజేపీ ● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

కరీంనగర్, మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉనికికే ప్రమాదం ఏర్పడనుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని హోదాలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తి ఆ రాజ్యాంగంపై ప్రమాణం చేసి దాని ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. విదేశాల్లో స్విస్ బ్యాంకు నల్లధనం తిరిగి తెప్పిస్తామని, 15 లక్షల ఖాతాలో జమ చేస్తామని చెప్పిన మోదీ హామీ ఏమైందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో 29 మంది గుజరాతీలు వేల కోట్లు ఎగవేశారన్నారు. మోదీకి భార్యపిల్లలు లేరని ఎగ్గొట్టిన వారే దత్తపుత్రులన్నారు. 11 వేల కోట్లు తీసుకున్న నీరవ్‌మోదీ ఎలక్టోరల్ బాండ్లకు 30 శాతం కట్టారన్నారు. మోదీ మిత్రుడైన అదానీ గంజాయి స్మగ్లర్ అని వీరిద్దరూ ఒకేసారి పైకి వచ్చారన్నారు. బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో పార్టీలను చీల్చి, ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని నారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో సైతం బీజేపీతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రమాదముందన్నారు. మహారాష్ట్రలో చేసిన విధంగా పార్టీల్లో చిచ్చులు పెట్టి ప్రభుత్వాలు కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీజేపీ తప్ప ఏపార్టీ మనుగడ సాగించ వద్దనే ఆలోచనతో మోదీ ఉన్నారన్నారు. అయోధ్య రామ మందిరాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఆదరాబాదరగా ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రారంభించారన్నారని అది అపశకునంగా మారిందన్నారు. దేశంలో రెండో విడత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఇండియా కూటమి వస్తే ముస్లింలు దాడులు చేస్తారని ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారన్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. మోదీకి వత్తాసు పలికినందుకు పది సంవత్సరాలుగా జగన్ మాత్రం బెయిల్‌పైనే ఉన్నాడన్నారు. ప్రస్తుతం బీజేపీయేతర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డిపై వేధింపులు మొదలయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపీలు ఎన్నికవుతున్నారని, పార్లమెంట్ పరిధిలో పది లక్షలకు పైగా ఉన్న ఓటర్ల అభిప్రాయాలకు విలువ లేకుండా పోతోందన్నారు. 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నుతున్నారని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి, అహంభావంతో ఓడిపోయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకే ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా చేరామని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ శ్రేణులు పనిచేస్తాయని నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్, ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

'కేడీసీసీబీ దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకు'

కరీంనగర్ టౌన్, మే 6: సహకార అభివృద్ధి నిధుల వినియోగంలో దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుగా ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నిలిచిందని నాబార్డు రిటైర్డు చీఫ్ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అభినందించారు. సోమవారం ఆయన సీడీఎఫ్ నిధులు వినియోగంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మురళీధర్‌తో కలిసి నగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డిసిసిబి సక్సెస్ ఫార్ములాను దేశంలోని అన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కేంద్రం, సిడిఎఫ్ వినియోగంపై అధ్యయనం చేసేందుకు నాబార్డు కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. టెస్కాబ్ ఎండి మురళీధర్ మాట్లాడుతూదేశంలోనే కేడీసీసీబీ నాలుగు విభాగాల్లో వరుసగా నాఫ్‌స్కాబ్ జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక సంఘాలను కంప్యూటరీకరణ చేసిన తొలి సహకార కేంద్ర బ్యాంకు కరీంనగర్‌లేదనని గుర్తు చేశారు. పిడిసి రిసోర్సు పర్సన్ జి. సత్యనారాయణ కేడీసీసీబీ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బ్యాంకు సీఈవో ఎన్.సత్యనారాయణరావు, నాబార్డు డిడిఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, దిలీప్, జనరల్ మేనేజర్లు పి.ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, డిజిఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎండపల్లి, మే6: బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన దోనిపెల్లి హరికృష్ణ (28) అలియాస్ మనోజ్ కుమార్ జయశంకర్ జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలోని మెగా కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. పని వద్ద ఉదయం ట్రాక్టర్‌తో వ్యవసాయ బావి వద్దకు నీరు తీసుకురావడానికి వెళ్లాడు. నీరు పడుతుండగా నీటి ట్యాంకర్ ఎంత వరకు నిండిందో చూద్దామని ట్యాంకర్ పైకి ఎక్కాడు. కరెంట్ తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పోస్ట్‌మార్టమ్ కోసం జయశంకర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి

బోయినపల్లి, మే 6: నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన చిత్తరి పుల్లయ్య (20) అతని తల్లి, చెల్లితో సహా వేములవాడలో నివాసముంటున్నారు. కాగా పుల్లయ్య గత 6 నెలల నుంచి బోయినిపల్లి మండలం కొదురుపాకలోని కల్లెం రాజయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గొర్రెలను తోలుకుని మేపడానికి మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ వైపు వెళ్లి అక్కడే ఈత నేర్చుకుంటున్నాడు. ఎప్పటిలాగే సాయిలు అనే మరో గొర్రెల కాపరితో కలిసి మిడ్ మానేర్ వైపు వెళ్లి ఈత కొడుతూ స్నానం చేయడానికి నీళ్లలోకి దిగాడు. అక్కడే పూడిక ఉండటంతో అందులో కురుకుపోయాడు. మృతుడు పుల్లయ్య ఎంతకు రాకపోవడంతో పైన ఉన్న సాయిలు గ్రామంలోకి వెళ్లి కొందరు గ్రామస్థులను తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాటర్ గుంతలో గాలించి పుల్లయ్య మృతదేహం బయటకు తీసి పోస్టుమార్టం కు పంపించారు. మృతుని తల్లి వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- పోలీసులకు చిక్కిన దొంగలు

కోరుట్ల మే 6: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించారు. అదే సమయంలో మొబైల్ పార్టీ పోలీసు గమనించి దొంగలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మెదట పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాతంలో ఉన్న శ్రీలక్ష్మి వైన్స్ వద్ద ఉన్న సీసీ పుటేజీలను ధ్వంసం చేసి వైన్స్ షెటర్లకు ఉన్న తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేయగా అవి రాక పోవడంతో అక్కడే ఉన్న ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో సీసీ పుటేజీ ధ్వంసం చేసి మిషన్ పూర్తిగా ధ్వంసం చేసి దానిలో ఉన్న డబ్బులను తీసే ప్రయత్నం చేసారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి నేషనల్ హైవేపై పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఎస్సై ఆ ప్రాంతానికి రావడంతో ఏటీయం వద్ద ఇద్దరు వ్యక్తులు కనపడడంతో అక్కడి వెళ్లి పరిశీలించాడు. ఏటీయం మిషన్ ధ్వసంమై చోరీకి యత్నించినట్లు గుర్తించారు. ఏటీయంలో ఉన్న వారు పారిపోవడానికి ప్రయత్నం చేయగా వారిని పట్టుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా వారు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పట్టణంలో మామిడికాయ దుకాణంలో కూలి పని చేయడానికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఉండి దొంగతనాలు పాల్పడుతుంటారని పోలీసు తెలిపారు. ఏటీఎం అధికారి శ్రీనివాస్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోరుట్ల ఎస్ఐ కిరణ్ తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 15మంది రైతులు 159క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డాక్టర్లు, సిబ్బందిపై దాడులు సరికాదు

సుభాష్‌నగర్, మే 6: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి దాడులు సరికాదని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు అన్నారు. డాక్టర్ ప్రతి రోగిని బతికించాలనే ప్రయత్నిస్తాడని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోగి మరణిస్తే దానికి డాక్టర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. రోగి బంధువులు విచక్షణ కోల్పోయి డాక్టర్, సిబ్బందిపై డీజిల్‌తో హత్యాయత్నం చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. ఆసుపత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయానకం సృష్టించడం హేయమైన చర్య అన్నారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు.

● దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

కోరుట్లలో ప్రభుత్వ వైద్యుడు, సిబ్బందిపై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ జి వెంకట్‌రెడ్డి, తానా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మహేశ్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ బిఎన్ రావు, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ అలీం, డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ దాడి అమానుష చర్యగా ఆయన పేర్కొన్నారు. హత్యాయత్నం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన ప్రభుత్వ ఆస్తులను వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ

● అడ్డు వచ్చిన వ్యక్తికి గాయాలు

ముత్తారం మే 6: ముత్తారం మండల కేంద్రంలోని నాగులమ్మ వైన్ షాపులో మద్యం సేవించి మద్యం మత్తులో రెండు వందల కోసం గ్రామానికి చెందిన మారం మల్లారెడ్డి, పింగిలి ప్రభాకర్ రెడ్డి అనే ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ తీవ్రతరమై బీరు సీసాలు పగలగొట్టుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా కేషనపల్లి గ్రామానికి చెందిన ఎండి షరీఫ్ వారిని ఆపే ప్రయత్నం చేయగా సీసా షరీఫ్ మెడలో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని చూసి స్థానికులు 108కు ఫోన్ చేసి పెద్దపల్లికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

వేములవాడ, మే 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి కార్యక్రమం సందర్భంగా బందోబస్తు నిర్వహణపై బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతో, ఐడి కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. హెలికాప్టర్ వద్ద విధులు నిర్వహించేవారు. అలర్ట్‌గా ఉండాలని, హెలికాప్టర్ వద్దకు ఎవరినీ రానివ్వకూడదని సూచించారు. ప్రతి అధికారి బందోబస్తు తనకు కేటాయించిన ప్రాంతంతో పాటు తాను నిర్వర్తించాల్సిన బాధ్యత గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్యూటీ ప్రదేశం నుంచి ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్ర చారి, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ జిల్లాల నుండి వచ్చిన డిఎస్పీలు, సి.ఐలు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్

రాయికల్, మే 6: డీజిల్ ఫిల్లింగ్ చేసుకోవడానికి వచ్చిన ఓ ట్రాక్టర్‌లో పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన సంఘటన రాయికల్ పట్టణంలోని జగిత్యాల రోడ్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకుంది. బాధిత ట్రాక్టర్ యాజమాని కుర్మ మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తన ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన విషయం తనకు తెలియదన్నారు. ఫిల్లింగ్ చేసిన పెట్రోల్‌ను బంక్ సిబ్బంది తొలగించే క్రమంలో సమాచారం రావడంతో బంక్ వద్దకు వెళ్లి చూడగా తన ట్రాక్టర్ నుంచి పెట్రోల్ తొలగించి, స్థానిక ట్రాక్టర్ షో రూం మెకానిక్‌తో రిపేర్ చేయడానికి బంక్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. సుమారు 2 గంటల పాటు ట్రాక్టర్ యాజమాని ఆందోళన చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ యాజమాని సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంక్ సిబ్బంది తీరుపై విచారణ జరిపి బంక్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పెట్రోల్ బంక్ సిబ్బందిని వివరణ కోరగా తాము డీజిల్‌కు బదులు పొరపాటున పెట్రోల్ ఫిల్లింగ్ చేసన విషయం వాస్తవమేనని అంగీకరించారు.

కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హత లేదు

● టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

కరీంనగర్ అర్బన్, మే6: తెలంగాణ ఉద్యమపార్టీ, రాజకీయపార్టీ అంటూ తెలంగాణ పదాన్ని బొందపెట్టి బీఆర్ఎస్‌గా మార్చుకున్న కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హతలేదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికారప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. డీసీసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, కవులు, విద్యార్థుల ఉద్యమాలతో 1200మంది ఆత్మ బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేసీఆర్ అవినీతి పాలనకు కేంద్ర బిందువు అయిందన్నారు. గ్రానైట్, ఇసుక మాఫియాలతో గుట్టలు, వాగులు, నదుల ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అవసరాలకే ట్రాక్టర్లతో మాత్రమే ఇసుక తీసుకువెళ్లే అవకాశం కల్పించామని మృత్యుంజయం తెలిపారు. కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8, ఎంఐఎంకు ఒక సీటు పంచుకున్నారని హరీశ్‌రావు వాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి ఏమి సీట్లు రావని చెప్పకనే చెప్పాడన్నారు. కరీంనగర్‌లో తీగల వంతెన, రివర్‌ఫ్రంట్‌లు కట్టమని ఎవరూ అడగలేదని, ఆ నాయకులు, కాంట్రాక్టర్ల కోసమే నిర్మించారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అవినీతి పాపాలు నేడు ఈ రాష్ట్రానికి శాపాలుగా మారాయన్నారు. కరీంనగర్‌లోని ఒక రైస్‌మిల్‌లో 600 కోట్ల విలువైన వరిధాన్యం ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా అక్కడే పెట్టారని, ఇంతటి అవినీతి జరుగుతున్నా పౌరసరఫరాల శాఖకు తెలియకుండా ఉందనేది విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. ముస్లింల రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేయాలని ఆయన ప్రశ్నించారు. మోదీతో చీకటి ఒప్పందం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించ కుండా, కేసీఆర్‌ను జైలుకు పంపించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 13 నుంచి 14 సీట్ల వరకు వస్తాయని, బీజేపీకికి మూడు లేదా నాలుగు సీట్లు రావ చ్చని, ఎంఐఎంకు ఒక సీటు వస్తుందని, బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర

● ఈనెల 8న రాజ్యాంగ రక్షణ సభ ● ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం

సుభాష్‌నగర్, మే6: ఆర్ఎస్ఎస్ మార్గదర్శనంలో రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దుకు బీజేపీ పూనుకోనున్నదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుపొందడం ద్వారా సులువుగా రాజ్యాంగాన్ని రద్దు పరచవచ్చన్న అంగీకారానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు వచ్చాయన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ధారా దత్తం చేశారని విమర్శించారు. రైతులపై నల్ల చట్టాలను తీసుకువచ్చి 750 మంది రైతుల చావులకు కారకులయ్యారని ఆరోపించారు.

● రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు యోచనను వ్యతిరేకిస్తూ బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో రాజ్యాంగ రక్షణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాం గం, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా చేసిన తీర్మాన ప్రతులు తమ వద్ద ఉన్నాయని, రాజ్యాంగ పరిరక్షణ సభలో బహిర్గతం చేస్తామన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ల రద్దుకు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందని, అందువల్లనే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నోరు మెదపడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, కొండ్ర స్వరూప, సుద్దాల లక్ష్మన్, గోష్కి శంకర్, కల్లెపల్లి శంకర్, ఆవారు లత, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం


అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

కరీంనగర్ క్రైం, మే 6: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన ఒక అవివాహిత(39)ని అదే గ్రామానికి చెందిన గువ్వల సత్యం(44) ఏడాదిగా ఆమె ఫోన్‌కు కాల్ చేసి మాట్లాడుతూ వేధిస్తుండేవాడు. గత జులై నెలలో ఆమె ఇంటికి వెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వీడియోలు తీశానని బ్లాక్‌మెయిల్ చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నేరస్తుడిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్శేడ్‌కు చెందిన నేరెళ్ల సంపత్‌కుమార్(43) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సంపత్‌కుమార్ చేగుర్తిలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, ఆదివారం ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇరుకుల్ల వద్ద ద్విచక్రవాహనాన్ని యూటర్న్ చేస్తుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తీగలవంతెన పైనుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ శివారులోని బైపాస్‌రోడ్ వద్ద తీగల వంతెనపై నుంచి కిందకు దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఒక వ్యక్తి తీగల వంతెనపై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉందని, ఎడమ కన్ను బొమ్మపై భాగంలో గాయానికి సంబంధించి ఏడు కుట్లు వేయబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాకు వివరాలు తెలుపాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాల కోసం ఫోన్: 8712670764, పోలీసు ఠాణా 8331940590లో సంప్రదించాలని కోరారు. మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చరీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాలపై ఎన్నికల కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మే 6 : ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త అయిన ఆకుల ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్ రెడ్డి తెలిపారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, సంబంధిత అధికారి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డ్‌కాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమంది ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించి, ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇంచార్జి, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బీ రమణారెడ్డి ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, సభ ఏర్పాటు చేసినందుకు ఆకుల ప్రకాష్‌లపై ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసు నమోదు చేసామన్నారు.

వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. పొలాల చుట్టూ మంటలు వ్యాపించాయి. ఆయా గ్రామాల్లోని రైతులకు చెందిన పశుగ్రాసం, విద్యుత్తు మోటార్లు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిబూడిదయ్యాయి. రైతులు చేరుకుని మంటలను అదుపు చేయడంతో చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. బాధిత రైతు వెంకట్‌రెడ్డి మాట్లడుతూ నాలుగు ఎకరాలలో పశుగ్రాసం కట్టలు కట్టి ఉంచామన్నారు. సోమవారం విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగి గడ్డి కాలి బుడిదయ్యిందని తెలిపాడు. గతంలో సైతం గడ్డి కాలి పోయిందని వైర్లను సరిచేయాలని సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు



తిమ్మాపూర్‌లో కాలిపోయిన పశుగ్రాసం

ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలి

● ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్ ఆకునూరి మురళి

జమ్మికుంట రూరల్, మే 6: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలని జాగో తెలంగాణ ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య యాత్ర సోమవారం జమ్మికుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఇవి తప్ప బీజేపి ప్రభుత్వం అన్ని చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, మోదీ ఇచ్చిన ఉద్యోగాలు కరీంనగర్‌లో ఎక్కడైనా కనిపించాయా చెప్పాలన్నారు. నల్ల చట్టాలు తీసుకు వచ్చి వందల మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారని గుర్తు చేశారు. పదేళ్ల పాలించి ప్రజలను మోసగించిన బీఆరెస్ పార్టీని తరిమి కొట్టారని, అదేవిధంగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఎండ తీవ్రత తట్టుకోలేక మహిళ మృతి

శంకరపట్నం, మే 6: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేశవపట్నం గ్రామానికి చెందిన పంజాల భారతి (55) సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.

బీ ఫార్మసీ, బీపీఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే6: ఎస్‌యూ పరిధిలోని బీ ఫార్మసీ మొదటి, రెండు, ఏడు, ఎనిమిదో సెమిస్టర్, బీపీఎడ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వంద రోజుల్లోనే హామీలను అమలు చేశాం

-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం -కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నాయకుల ప్రచారం



కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, మే6: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చినట్టు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట, గుమ్లాపూర్, చిట్యాలపల్లి, మంగళపల్లి, కుర్మపల్లి, దేశాయ్‌పేట, ఆర్నకొండ, రాగం పేట, రేవెల్లి, గ్రామాలలో పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆగష్టు 15లోపు రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని అన్నారు.

●గంగాధర:సంక్షేమాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంతరావుతో పాటు ఒద్యారం, మల్లాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధరలో వారికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు.

●శంకరపట్నం: శంకరపట్నం మండలంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కేశవపట్నం, మొలంగూర్ గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని నగరంలో పలు డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు కార్యకర్తలతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 35వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు. నగరంలోని 11వ డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం చేశారు.

●మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి, మాన కొండూర్, గంగిపల్లి, అన్నారం గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు చేరుకొని మజ్జిక ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రవీంద్రాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, జిల్లా కార్యదర్శి సంపత్ ఉన్నారు.

●వీణవంక: మామిడాలపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి,నాయకులు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, నల్ల కొండల్ రెడ్డి, తిరుమలేష్, సాహెబ్ హుస్సేన్, గట్టయ్య నరేందర్ రెడ్డి, మోహన్‌రెడ్డి,లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

●హుజూరాబాద్ రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాల గురించి వొడితల ప్రణవ్ వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్, నాయకులు కొల్లూరి కిరణ్, కిరణ్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా నాయకుల ప్రచారం



చొప్పదండి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

కరీంనగర్ టౌన్, మే 6: కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు వెలిచాల రాజేందర్‌రావు, బండి సంజయ్‌కుమార్‌కు ఓట్లు యావే తప్ప ప్రజా సమస్యలు పట్టింపు లేదని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. సోమవారం నగరంలోని బీఆర్‌ఎస్ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు కర్రుకాల్చి వాత పెట్టేందుకు కరీంనగర్ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు నిర్ణయించుకున్నారని, ఎవరెన్ని రాజకీయ కుట్రలు చేసిన వినోద్‌కుమార్ గెలుపు తథ్యమని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు కుల్దీప్‌వర్మ, బోనకుర్తి సాయికృష్ణ, షౌకత్ అలీ, వాజిద్, గంగాధర చందు, నవాజ్, ఆరె రవిగౌడ్, చేతి చంద్రశేఖర్, సత్తినేని శ్రీనివాస్, ఒడ్నాల రాజు, మెరుగు శ్రీనివాస్‌గౌడ్, బీర్ల రాజు పాల్గొన్నారు.

●గంగాధర: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండానే ఆపార్టీ అదినేత రాహుల్ గాంధీతో అమలు చేస్తున్నట్లు అబద్దాలు మాట్లాడించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. సోమవారం ఆయన గంగాధరలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు 2500 ఇవ్వకుండానే ఇస్తున్నట్లు రాహుల్ గాంధీతో చెప్పించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

●మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధీహామీ పనుల వద్దకు వెళ్లి రోజుకు కూలీ ఎంత వస్తుందని, సౌకర్యాలు కల్పిస్తున్నారా అంటు కూలీలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ఓటు గెలిపించాలని కూలీలను అభ్యరించారు. ఈయన వెంబడి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

●చొప్పదండి: బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ మండలంలోని రేవెల్లి,పెద్దకుర్మపల్లి, గ్రామాలలో పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడి ఓట్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, బందారపు ఆజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

●శంకరపట్నం: శంకరపట్నం మండలం ఇప్పలపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు, హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బొమ్మ శ్రీరాంచక్రవర్తి



శ్రీరాంచక్రవర్తికి కండువాకప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 6 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ బీజేపీ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, ఇతర ముఖ్య నేతలు సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రెటరీ రోహిత్‌చౌదరి, సీఎం ప్రధాన సలహాదారు వేంనరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

●తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి హుస్నాబాద్ బీజేపీ ఇంచార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తితో పాటు ఇతర ముఖ్య నేతలను పరిచయం చేశారు.

ఓట్ల కోసం తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్న కేసీఆర్

-మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్

కరీంనగర్ అర్బన్, మే 6: ఓట్ల కోసం తెలంగాణ ప్రజలను మరోమారు మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసన మండలి సభ్యుడు టి.సంతోష్‌కుమార్ విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్న కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ఇంకా ఉందని, రాష్ట్ర పునర్నిర్మాణం ఇంకా మిగిలే ఉందంటూ తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి రాజేసే ప్రయత్నం చేశారని ఆయన విమర్శించారు. గులాబీ నాయకులు ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు పంపిణీ

కరీంనగర్ టౌన్, మే 6: రోటరీ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లక్షా యాభై వేల రూపాయల విలువ చేసే సిమెంట్ బెంచీలు, ఐదుగురు నిరుపేద పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేశారు. సోమవారం నగరంలో జరిగిన రోటరీక్లబ్ ఆఫ్ కరీంనగర్ అధికారిక సమావేశానికి జిల్లా గవర్నర్ కొత్త శంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు జి.వెంకటకిషన్, ప్రధాన కార్యదర్శి పాక పవన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జగ్గారెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, మే 6: ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి రెడ్డి సంఘాల మద్దతు కాంగ్రెస్‌కేనని ఏకపక్షంగా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని సంఘాల ప్రతినిధులు అన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెడ్డి సంఘాలతో ఎలాంటి సమావేశాలు తీర్మానాలు జరపలేదన్నారు. కేవలం ఆయన ఇసుక దందా నడుపుకోవడానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రెడ్డి సంఘాన్ని తాకట్టు పెట్టుకోవడానికి సిద్ధపడ్డాడని విమర్శించారు. ఈ సమావేశంలో రేకులపల్లి రవీందర్‌రెడ్డి, కాసర్ల మధుకర్‌రెడ్డి, బేతి మహేందర్‌రెడ్డి, కూర మహిపాల్‌రెడ్డి, పోరెడ్డి జనార్దన్‌రెడ్డి, కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, రావుల కిరణ్‌రెడ్డి, న్యాలకొండ ప్రసన్నకుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ దొంగలను అరెస్టు చేయని కాంగ్రెస్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలెంకి శ్రీనివాస్ -బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతుగా నాయకుల ప్రచారం



మాట్లాడుతున్న సోలెంకి శ్రీనివాస్

భగత్‌నగర్, మే 6: ఫోన్ ట్యాపింగ్ అసలైన దొంగలను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలెంకి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలు చెబితేనే ఫోన్ ట్యాప్ చేశామని రాధకిషన్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించారని, ఇంత స్పష్టమైన ఆధారాలు ఉన్నా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకడుగు వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కైనందునే తదుపరి విచారణ లేకుండా కేసును నీరుగారుస్తుందన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎన్నం ప్రకాష్, మీడియా కన్వినర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధి, సెన్సార్ బోర్డుసభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర, నాయకులు రంగు సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: హుస్నాబాద్ నియోజక వర్గంలోని పలువురు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజక వర్గం కోహెడ మండలం రామచంద్రాపూర్ తాజా మాజీ సర్పంచ్ నోముల పద్మ, కొండాల్‌రెడ్డి అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వీరితో పాటు వార్డు సభ్యుడు బినమేని రామస్వామి, మారెల్ల రాకేష్, పడాల అజయ్, కాశెట్టి సాయి, చింతల వికాస్, మాజీసర్పంచ్ బినమేని వాణిలక్ష్మణ్‌లు బీజేపీలో చేరారు.

●నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ నిర్మలరెడ్డి, నాంపల్లి శంకర్, పింగలి ప్రతాపరెడ్డి, పిచార విష్ణుప్రసాద్‌రావు, లక్ష్మీరాజం, గోదరి నరేష్, మహిళా మోర్చా నాయకురాలు వేదం శిల్ప, వరాల జ్యోతి, చంద్రకళ, పరమేశ్వర గురుస్వామి, జనగాం రజిత, ముదిమడుగుల రుక్మిణి పాల్గొన్నారు.

●గన్నేరువరం: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా మండల బీజెపి అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని సోమవారం మండలంలో నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి మండల కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజెపి నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, మచ్చ బాలరాజు, కుర్ర హరీష్, గడ్డం సుయిత్‌రెడ్డి, మురళి భారీ సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, మండలాధ్యక్షుడు అనిల్‌లు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవస్థానం వద్ద ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ మండలంలోని అన్ని గ్రామాల మీదుగా కొనసాగింది. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. బీజేపీ గెలుపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, నరేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కరీంనగర్ అర్బన్, మే6: బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండి సంజయ్‌కుమార్ పదే పదే విద్వేష పూరిత ప్రసంగాలను చేస్తూ, బహిరంగంగా ప్రజలను రెచ్చగొడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీసీసీ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్ కరీంనగర్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ తన ప్రసంగాలలో హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడిని నా రాముడు అని, తనకు చెందిన వాడిగా ఆ రాముని పేరుని ఎన్నికల ప్రచారంలో వాడుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాముడిని అవమానిస్తున్నారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ, మతపరంగా ఓట్లు అడుగుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బండి సంజయ్‌కుమార్‌ను ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచాలని సుజిత్‌కుమార్ తన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రజా సంబంధాల అధికారి దొంతి గోపి ఉన్నారు.

ట్రినిటిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్ రూరల్, మే6:మండలంలోని బొమ్మకల్ గ్రామంలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు జెన్‌పాక్ట్ కంపెనీ వారు సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బాగంగా 250మంది విద్యార్థులు హాజరుకాగా 86మంది షార్ట్ లిస్టు చేసినట్లు కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర, ఏవో ఎన్ రాధాకృష్ణ, ఎంబీఏ విభాగపు అధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సిహెచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి తనిఖీలు

తిమ్మాపూర్, మే6: తిమ్మాపూర్ గ్రామ పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ సోమవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీలో చలివేంద్రంను, కం పోస్ట్ స్టాల్‌ను, శానిటేషన్, ప్లాంటేషన్, నర్సరీ, కంపోస్ట్ షెడ్, వైకుంఠ దామంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపివో కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్ రావు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హరికిషన్

హుజూరాబాద్, మే 6: హుజూరాబాద్ పట్టణానికి చెందిన రాయబారపు హరికిషన్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన అయిలేష్‌యాదవ్, ఆర్ కృష్ణయ్యలకు హరికిషన్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, మే6: విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సోమవారం మండ లంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశా లలో ఐఎస్‌టీఈ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్డియు నో బిగినర్స్' అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమంలో ట్రైనర్ ఈటూతీ సంస్థ ప్రతినిధి అనిల్ మధులా కర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎంవి సతీష్ కుమార్, డీన్ యోగేష్ ఫుండలిక్, రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజే శ్వర్‌రావు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు

హుజూరాబాద్, మే 6: హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లోని పెద్దమోరి సమీపంలో అసైన్డ్ భూములను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేసినట్లు జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల్లో హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లి, కొత్తపల్లి, రంగాపూర్ ప్రభుత్వ గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తీసుకొచ్చి పోస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులకు ఈ విషయం తెలిసిన కూడా పట్టించుకోవడం లేదని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

హుజూరాబాద్, మే 6: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ట్రాన్స్‌కో ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకో వాలని జిల్లా ఎస్‌ఈ వి గంగాధర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ డివిజన్ డీఈ, ఏడీఈ, ఏఈ, విద్యుత్ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది మరమ్మత్తులు చేసేటప్పుడు హెల్మెట్, గ్లౌజ్, టెస్టర్, ఎర్త్ రాడ్ లాంటివి ఉపయోగించాలన్నారు. సమావేశంలో డీఈలు విజేందర్‌రెడ్డి, ఎస్ లక్ష్మారెడ్డి, ఎస్‌ఏవో రాజేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే అంబేద్కర్, దళిత సంఘాల మద్దతు

గంగాధర, మే 6: కాంగ్రెస్ పార్టీకే అంబేద్కర్, దళిత సంఘాల మద్దతు ఉంటుందని ఆ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన, దళిత,మైనారిటీ వర్గాలకు పదేళ్లలో ఒరగబెట్టిందేమిలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేయాలని చూస్తుంద న్నారు. కార్యక్రమంలో తడగొండ నర్సింగ్ బాబు, దుబ్బాసి బుచ్చయ్య, మ్యాక వినోద్ పాల్గొన్నారు.

'గౌడ కులస్తుల సమస్యలు పట్టని పొన్నం'

భగత్‌నగర్, మే 6: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గౌడ కులస్థులు, బీసీల సమస్యలు పట్టవని గౌడ జాగృతి, కల్లు గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగు సంపత్‌గౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం పొన్నం ప్రభాకర్ ఏనాడూ మాట్లాడలేదన్నారు. బీసీలంతా బండి సంజయ్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎన్నం ప్రకాష్, రాగి సత్య నారాయణ, ఉయ్యాల మధుగౌడ్ పాల్గొన్నారు.

'దేశ సంపద కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం'

భగత్‌నగర్, మే 6: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు బీజేపీ ధారాదత్తం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఎన్నికల మేనిఫెస్టో, బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం పది గంటలకు సీపీఎం పార్లమెంట్ స్థాయిసమావేశాలు నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని సీపీఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమాసాహెబ్, యు శ్రీనివాస్, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత ఖాలిద్‌కు ప్రశంసాపత్రం

కరీంనగర్ కల్చరల్, మే 6: అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ తెలంగాణ శాఖ, అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన శ్రీక్రోధి ఉగాది కవితా కదంబం పుస్తకావిష్కరణలో జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్, రచయిత ఎండీ ఖాలిద్‌కు తన కవితా పఠనానికి గాను ప్రశంసాపత్రం అందజేశారు. అతిథులుగా తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్, ఏబీబీఎస్‌ఎస్ అధ్యక్షుడు ఆచార్య కడారి సత్యమూర్తి, పత్రికా సంపాదకుడు బైస దేవదాసు పాల్గొన్నారు.

10నుంచి దుర్గా భవాని ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, మే6: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఈనెల10 నుంచి 12 వరకు దుర్గాభవానీ అమ్మవారి సప్తమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. 10న ఉదయం 6గంటలకు గణపతి పూజ, గురువందనం, అమ్మవారికి విశేషాభిషేకం నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. 10గంటలకు చండిహోమం పూర్ణాహుతి, ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. 11 ఉదయం సౌందర్యలహరి హోమం, 9గంటలకు పూర్ణాహుతి, 10గంటలకు హను మాన్ చాలీసా పారాయణం సాయంత్రం భవాని సుందరేశ్వరుల ఎదురుకోళ్ళు 12న ఉదయం శంకరాచార్య జయంతి పురస్కరించుకుని శంకరాచార్యుల వారికి విశేష పంచామృతాభిషేకం, భాష్యపారాయణం, 10గంటలకు దుర్గాభవానీ సుందరేశ్వరుల కళ్యాణం, మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కరీంనగర్ రూరల్, మే6: సామాజిక కార్యకర్త సయ్యద్ ముజఫర్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. మండలంలోని బొమ్మకల్ గ్రామంలో రజ్వీ చమన్, సిటిజన్ కాలనీలలో పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జాబిర్ ఉల్‌హక్, సయ్యద్ అఫ్జల్, గులాం ఖాన్, అంజద్ అలీ, మహమ్మద్ షాహిద్, రఫిక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కారుడికి సన్మానం

రామడుగు, మే 6 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అనే విద్యార్థి అంతర్జాతీయ అండర్ 14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడ. నేపాల్‌లో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనే భారత జట్టు తరుపున ఆడనున్నారు. ఈసందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న దీపక్‌ను సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

జమ్మికుంట రూరల్, మే 6: జమ్మికుంట మండలం లోని తాజా మాజీ సర్పంచ్‌లు మాదిరెడ్డి వెంకటరెడ్డి, చినుముల వసంత-రామస్వామిల ఆధ్వర్యంలో పలువురు హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సంద ర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశిని కోటి, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌వి అసత్య ప్రచారాలు'

జమ్మికుంట, మే 6: వీణవంక పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా అసత్య ప్రచారాలు చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హుజూ రాబాద్ నియోజక వర్గంలో ఎక్కడ పంట పొలాలు ఎండి పోలేదని, వడ్ల కొనుగోళ్లు పూర్తి అయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు చూసి ఓర్వలేకనే బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వీణవంక, మే 6:మండల కేంద్రానికి చెందిన రాంపల్లి సాయి కూమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. తనతో జిల్లా పరిషత్ ఉన్నాత పాఠశాలలో (1996-97)పదవ తరగతి చదువుకున్నా తోటి స్నేహితులు రూ.51,500 ను కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయి కూమార్‌కు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తోటి స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమములో స్నేహితులు తిరుమల దేవి,రాధాకృష్ణ, సంపత్, శంకర్, తిరుపతి, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

రామ్ కథా ప్రవచనం

కరీంనగర్ కల్చరల్, మే 6: నగర శివారులోని కెఎస్‌ఎల్ గార్డెన్‌లో సోమవారం రెండవ రోజు కమల్ కిషోర్ ముందాడా, నంద కిషోర్ ముందాడా ఆధ్వర్యంలో వరంగల్‌కు చెందిన పవన్ మహారాజ్ రామ్ కథా ప్రవచనం చేశారు. రాముని జీవిత విశేషాలను, మూల్యాలను వివరించారు. కార్యక్రమంలో సరళాముందాడా, సునందాముందాడా, సంతోష్‌కార్వా, దీపకంకాని, లద్దాముందాడా పాల్గొన్నారు.